వరలక్ష్మీ నమోస్తుతే..



ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మీ అమ్మవారు

దిల్‌సుఖ్‌నగర్/సైదాబాద్: శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. అమ్మవారి ఆలయాలన్నీ ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. సైదాబాద్ డివిజన్ మాతామైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయదుర్గా మాతా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయం, దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయం, శ్రీదుర్గాదేవి దేవాలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, మాదన్నపేట్‌లోని దుర్గాదేవి ఆలయం, సైదాబాద్‌లోని శ్రీజయదుర్గా, శ్రీవిజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాలలోని అమ్మవారి ఆలయాలు, ఇళ్లలో శ్రావణమాస వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరుపుకున్నారు.



ఆలయం ఎదుట భక్తుల సందడి



కరెన్సీ నోట్ల అలంకరణలో విజయదుర్గా మాతా



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



వరలక్ష్మీ వ్రతం పూజల్లో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



దుర్గాదేవాలయంలో లక్ష్మీదేవి అలంకరణలో ఉన్న దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విద్యుదాఘాతాలు జరగకుండా చర్యలు



కండక్టర్లను పరిశీలిస్తున్న డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఈ ప్రసాద్

చాదర్‌ఘాట్: స్తంభాలకు ఉండే కండక్టర్లతో బస్తీ ప్రజలు విద్యుదాఘాతనికి గురయ్యే ప్రమాదం పొంచి ఉన్నందున వాటి తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని ఆస్మాన్‌గఢ్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. బస్తీల్లో కండక్టర్లను తొలగించి కేబుళ్లను అమర్చాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన చాదర్‌ఘాట్ సెక్షన్ ఏఈ ప్రసాద్‌తో కలిసి కమలానగర్, మూసానగర్, కట్టెలగూడ, చంచల్‌గూడ బస్తీల్లో పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్ల కండక్టర్లను పరిశీలించారు. చాదర్‌ఘాట్ సెక్షన్ పరిధిలో విద్యుత్ వైరింగ్ వ్యవస్థను క్రమం తప్పకుండా తనిఖీ చేయటం జరుగుతుందని, విద్యుత్ ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

మూసీ పరీవాహకంలో కలెక్టర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

చాదర్‌ఘాట్: శంకర్‌నగర్ మూసీ పరీవాహక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ హరిచందన సందర్శించారు. వరద ప్రవాహం పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. రెండు గేట్లు తెరవడంతో మూసీ పరీవాహక ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు లేవని జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, హైడ్రా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులు సమీక్షిస్తున్నారన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. డివిజన్ పరిధిలోని అజంపురా వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారన్నారు. పేదల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

బురద తొలగింపు



మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌లోని సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీలలో గురువారం కురిసిన భారీ వర్షానికి వరదనీరు భారీగా రహదారులపై ప్రవహించింది. వరద తగ్గిన తర్వాత రోడ్లపై మట్టి పేరుకుపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం అందుకున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి రహదారులపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగింపజేశారు.

వంట చేస్తున్న మహిళపై దాడి

బంగారి గాజులు, గొలుసుతో పరార్

చైతన్యపురి: వంట గదిలో ఓ మహిళపై దాడి చేసిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని పుస్తెలతాడు, బంగారు గాజులు లాక్కెళ్లిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాలు.. చంపాపేట కటకోనికుంటలో రాంచందర్‌రావు భార్య వరలక్ష్మి శుక్రవారం మధ్యాహ్నం వంట చేస్తోంది. ఒంటరిగా ఉన్నట్లు గమనించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి ఆమె మెడలోని నాలుగు తులాల పుస్తెలతాడు, చేతికి ఉన్న నాలుగు తులాల బంగారు గాజులు లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధుల మంజూరుకు వినతి



ఎండీకి వినతి పత్రం ఇస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న సుజాతనాయక్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లోని డ్రైనేజీల ఆధునీకరణకు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి వాటర్ వర్క్స్ ఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐఎస్‌సదన్‌లోని చాలా కాలనీల్లో దశాబ్దాల క్రితం నాటి డ్రైనేజీలు చిన్నపాటి వర్షాలకు పొంగి పొర్లుతున్నాయన్నారు. డివిజన్‌లోని ఆయా ప్రాంతాలలో అస్తవ్యస్తంగా ఉన్న సీవరేజీ పైపులైన్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతన డ్రైనేజీలను ఆధునీకరిస్తే సమస్య పరిష్కారమవుతుందని విజ్ఞప్తి చేశారు.

మేయర్‌కు వినతి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని కొత్తకాలనీలు వెలుస్తున్నాయని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. వివిధ కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు చేయాలని శుక్రవారం ఆమె జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీ, గణేశ్‌నగర్‌కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.88 కోట్లు మంజూరు చేయించామని అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినత ఆర్వత డివిజన్‌కు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేశామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జక్కిడి రఘువీర్‌రెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధి షిరిడీ సాయినగర్‌కాలనీ (వీరన్నగుట్ట)కు చెందిన చవ్వగాని వెంకన్నకు నగరంలోని ప్రైవేటు హాస్పిటల్‌లో కాలుకు శస్త్రచికిత్స జరిగింది. చికిత్స ఖర్చులు భరించలేక వెంకన్న బీఆర్‌ఎస్ యువ నేత జక్కిడి రఘువీర్‌రెడ్డిని సంప్రదించాడు. ఆయన విషయాన్ని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.19.500 వేల చెక్కును జక్కిడి రఘువీర్‌రెడ్డి శుక్రవారం వెంకన్న కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహయాదవ్, రవిగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, సందీప్ పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతు చేయాలి



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని గాయత్రిపురం ప్రధాన రహదారి గురువారం కురిసిన భారీ వర్షానికి పూర్తిగా కొట్టుకుపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మరమ్మతు చేయాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కొత్తపేట డివిజన్ పరిధిలోని పర్యటించి పరిశీలించారు. అక్కడే జరుగుతున్న స్ట్రామ్ వాటర్ లైన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్ గౌడ్, ఎస్ ఆర్ ఎల్ కాలనీ అధ్యక్షులు సుధాకర్, కొరివి శ్రీనివాస్, తులసి పాల్గొన్నారు.

పండుగ సాయన్నకు నివాళి

నాగోలు: నిజాం రాజ్యంలో తిరుగుబాట్లు, ఉద్యమాలు చేసిన నాయకుడు పండుగ సాయన్న అని మన ఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం నాగోలులోని మాస్ కేంద్ర కార్యాలయంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కటకం నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. పండుగ సాయన్న పేద ప్రజలకు సహాయం చేసేవాడిగా గుర్తింపు పొందాడన్నారు. ప్రజల కోసం ఆధిపత్య వర్గాలపై ఎనలేని పోరాటం చేశాడని గుర్తు చేశారు. బ్రహ్మయ్య మాట్లాడుతూ.. రాబిన్‌వుడ్ లాగా పండుగ సాయన్న కేవలం ధనవంతులను కొట్టి పేదవారికి పెట్టే పనిపెట్టుకోలేదు. నిరంకుశ నిజాం అధికారులను ప్రశ్నించి వారిని ఎదిరించి తన సొంత పాలన వ్యవస్థను స్థాపించుకొని ఒక సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించే ప్రయత్నం చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, కాశీనాథ్, దశరథ సాగర్, సామ పృథ్వీరాజ్ ముదిరాజ్, కిరణ్ దాస్, రమేష్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



వెంకటేశ్వరరావు మృతదేహం

చైతన్యపురి: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. సత్యనగర్ జనప్రియ అపార్టుమెంట్‌లో ఉంటున్న బొడిశ మంగమ్మ భర్త 15 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఇద్దరు కూతళ్లకు వివాహం జరిపించింది. కుమారుడు వెంకటేశ్వరరావు (25) చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. తన కొడుకు చెడు అలవాట్లను మాన్పించేందుకు ఆరునెలల క్రితం నాగోలులోని రీహాబిలిటేషన్ సెంటర్ చేర్పించింది. ఇటీవల ఇంటికి తీసుకుని వచ్చింది. అయినా ఎలాంటి మార్పు రాలేదు. గురువారం రాత్రి భోజనం చేసి పడుకున్న వెంకటేశ్వరరావుని నిద్రలేపడానికి గదిలోకి వెళ్లగా చున్నీతో ఉరేసుకుని ఉండటం గమనించి కిందకి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు.

నేడు క్రైస్తవ యువజన ప్రార్థన సమావేశం

మలక్‌పేట: మలక్‌పేటలోని హైటెక్ ఫంక్షన్ హాల్ సమీపంలోని ది పెంతకోస్తు మిషన్ చర్చిలో క్రైస్తవ యువజన ప్రార్థన సమావేశం జరుగుతుందని బ్రదర్ శ్యామ్‌పాల్ తెలిపారు. మలక్‌పేట అంబర్‌పేట, ఎల్‌బీనగర్, ఉప్పల్, ముషీరాబాద్ నియోజకవర్గాల అన్ని క్రిస్టియన్ డినామినేషన్ ఇండిపెండెంట్ చర్చిల క్రైస్తవ యువతీ యువకుల సమావేశానికి హాజరు కావొచ్చన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బైబిల్ వాక్య సందేశం, దైవిక స్వస్థత అంశాలపై ప్రసంగం, ప్రత్యేక సంగీతం పాటలు ఉంటాయన్నారు.

ధ్వజస్తంభ యంత్ర పునఃప్రతిష్టాపన

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతం అష్ట లక్ష్మీ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి కాలనీలో అష్ట లక్ష్మి దేవాలయంలో నూతన ధ్వజస్తంభ యంత్రపునఃప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదిలక్ష్మి సమేత శ్రీమాన్నారాయణ స్వామివారి నవకలశస్నాపన, అభిషేకం, హయగ్రీవ జయంతి, సమూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు.

బ్యాడ్మింటన్‌లో సత్తా



నాగోలు: శ్రీలంకలోని కొలంబోలో ఈ నెల 5 నుంచి 8 వరకు జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చదరం హంసిని ప్రతిభ కనబరిచింది. నాగోలుకు చెందిన భాస్కర్ బాబు ఆర్-3 బ్యాడ్మింటన్ అకాడమీ (బీబీబీఏ)లో కోచ్ భాస్కర్ బాబు మార్గదర్శకత్వంలో శిక్షణ తీసుకున్న చదరం హంసిని బాలికల సింగిల్స్ అండర్-15లో టైటిల్ సాధించింది.

వ్యక్తి అదృశ్యం



రమేష్

నాగోలు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తట్టిఅన్నారం వైఎస్సార్‌నగర్ కాలనీలో ఉంటున్న జింకల రమేష్ (40)ఎల్లమ్మ భార్యాభర్తలు. ఈ నెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రమేష్ ఎంతకీ రాకపోవడంతో శుక్రవారం భార్య ఎల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమేష్‌కు మద్యం తాగే అలవాటు ఉందని ఎక్కువగా తాగినప్పుడు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయి రెండు. మూడ్రోజులకు వచ్చేవాడని ఫిర్యాదులో పేర్కొంది.

మట్టి విగ్రహాలనే ప్రతిష్టించుకోవాలి



మట్టి గణపతికి రాఖీలు కడుతున్న చిన్నారులు

వనస్థలిపురం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం ప్రతినిధులు రాబోయే వినాయక చవితిని దృష్టిలో ఉంచుకుని రాఖీ పండుగ సందర్భంగా వినూత్న కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం వనస్థలిపురంలో పర్యావరణ మట్టి గణపతికి చిన్నారులచే రాఖీలు కట్టించి వినాయక చవితిని పర్యావరణ ప్రియంగా జరుపుకుంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ మాట్లాడుతూ.. రసాయనిక రంగులతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ గణపతులు పర్యావరణానికి హానికరమని, మట్టి గణపతులనే ప్రతిష్ఠించేలా విద్యార్థులు చొరవ చూపాలన్నారు. నిర్వాహకులు మండపాల వద్ద ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు వాడవద్దని, ప్రత్యామ్నాయంగా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, చెర్రి, ప్రీతి, క్రితిక, దీక్షిక, గోమయి, పవిత్ర, హర్షిత, విఘ్నేష్, బాలు, మహేష్, రామ్‌దాస్ పాల్గొన్నారు.

ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విజయవాడ జాతీయ రహదారి వద్ద నూతనంగా నిర్మించనున్న హైకోర్టు కాలనీ ముఖద్వారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, దీపావళి శ్రవణ్ కుమార్, గుత్తా లక్ష్మారెడ్డి, వెంకటస్వామి యాదవ్, కే.ఎల్.నర్సింహారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

చెరువులోకి నీరు చేరేలా చర్యలు చేపట్టాలి



చిన్నచెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీలలో డ్రైనేజీ మురుగు రోడ్లపై పారుతుందని జలమండలి, సివరేజీ బోర్డు అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. గణేష్‌నగర్‌కాలనీలో గతంలో చిన్న పాటి వర్షానికే వరదనీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడేవారని, వరదకాలువ పూర్తిచేయటంతో సమస్య తీరిందన్నారు. భారీ వర్షం కురిసినా చెరువులోకి చుక్క నీరు చేరలేదని, వరద కాలువలు పునరుద్ధరణ చేసి చిన్న చెరువులోకి నీరు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. వీకర్‌సెక్షన్ కాలనీలో వరద కాలువకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

శుభాకాంక్షలు



మక్బూల్ జానీని సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

నాగోలు: నాగోలు పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మక్బూల్ జానీని శుక్రవారం సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ ఫైమీద ఆధ్వర్యంలో నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫైమీద మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో అన్ని విధాల సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ పాషా షాహిద బేగం, రాములు, శ్రీనివాస్, రాము, మహేందర్, ధనమ్మ, అంజమ్మ, కృపావరం పాస్టర్, యాదయ్య, రాజుగౌడ్, మధు, సంపత్, పద్మ, హేమలత, బాలమణి పాల్గొన్నారు.

బిహార్, మహారాష్ట్రలో ఓట్లు తొలగించడం దుర్మార్గం

ఎల్‌బీనగర్: బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కై బిహార్, మహారాష్ట్రలో మైనార్టీ, దళితుల ఓట్లను తొలగించడం దుర్మార్గమని రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. ఎల్‌బీనగర్ చౌరస్తాలో పార్టీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో ఆయన మాట్లాడారు. బిహార్‌లో తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలన్నారు. బిహార్‌లో బీజేపీని గెలిపించడంకోసం 64 లక్షల ఓట్లను తొలగించిన కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహించాల్సి వచ్చిందన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీ కమిషన్‌లాగా మారిపోయిందని ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, మంతాని యాదయ్య, భూషరాజు కాశయ్య, పురుషోత్తంచారి, దండు రాధ, పి.లక్ష్మయ్య, కుంటిగొల్ల రాములు, రాధమ్మ, గంగమ్మ, కుక్కమూడు వెంకటయ్య, ఎస్.లక్ష్మన్, ఇద్దయ్య, సైదులు పాల్గొన్నారు.

నాగోలులో..

నాగోలు: బీజేపీ ఈసీతో కలిసి బిహార్‌లో నిజమైన ఓటర్లను తొలగించి లక్ష నకిలీ ఓట్లు నమోదు చేయడం ఈసీకి ఉండే ప్రతిష్ఠాత్మకమైన స్వయం ప్రతిపత్తిని నీరుగాల్చడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని సీపీఎం సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సీహెచ్ వెంకన్న అన్నారు. ఈసీ తీరును నిరసిస్తూ శుక్రవారం నాగోలులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశంలో అనేక రాష్ట్రాల ఓటర్ల జాబితాలో నకిలీ ఓటర్ల పేర్లు ఉన్నట్లు తెలుస్తుంది. ఎగ్జిట్ పోల్స్ ఒపీనియన్ పోల్స్‌కు ఎప్పుడు జరిగే విధంగా కాకుండా వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు రావడం గమనించామని పేర్కొన్నారు. హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఫలితాలు కూడా అనుమానాలకు దారితీస్తుందన్నారు. నిరసనలో మనోహర్, వీరయ్య, కట్ట శ్రీను, చైతన్య, రాములు లతీఫ్ చంద్రయ్య పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



నాగోలులో నిరసన తెలుపుతున్న పార్టీ నాయకులు